సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 28 । జూలై । 2023




పేదల్లోనే క్యాన్సర్ మరణాలు

అధిక క్యాన్సర్ మరణాలు పేద, మధ్య తరగతి ప్రజల్లోనే సంభవిస్తున్నాయని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, డాక్టర్ ఫెర్నాండెజ్ అన్నారు. 8లో



రైవాడకు భారీగా వరద నీరు

రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. భారీగా వర్షాలు కురుస్తుండడంతో వరదనీరు పోటెత్తుతోంది. 8లో



ఏవోబీలో రెడ్ అలెర్ట్

మావోయిస్టు పార్టీ అమర వీరుల వారోత్సవాల నేపథ్యంలో ఏవోబీలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. 8లో

న్యూస్‌రీల్

బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీపీహెచ్ యూనిట్ భవన నిర్మాణానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ గురువారం శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భవనం ప్లాన్‌ను పరిశీలించి, పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత కలగా గున్నయ్య నాయుడు, జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి ఎం.ఎస్.వి.కె. బాలాజీ, వైద్యాధికారి యు.రమేష్, ఎంపీటీసీ సభ్యులు లగిశెట్టి భవాని, అద్దంకి సతీష్, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్ని రాజీవ్, గుమ్మడి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కుస్తీ పోటీలు

మునగపాక : మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు అనకాపల్లి జిల్లా గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు టి.జ్యోతిర్మయి ఓ ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు జరిగే పోటీల్లో పాల్గొనే బాల, బాలికలు 2007 నుంచి 2013–14 సంవత్సరాల లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. పోటీలకు వచ్చేటప్పుడు ఒరిజనల్ ఆధార్‌కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. ఇక్కడ ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 29, 30 తేదీల్లో అనకాపల్లి రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 8008307773 లో సంప్రదించాలని జ్యోతిర్మయి కోరారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు



కేసు నమోదు చేస్తున్న రామచంద్రరావు

అనకాపల్లిటౌన్: పట్టణంలోని పలు దుకాణాలపై గురువారం తూనికలు, కొలతలశాఖ అధికారులు దాడులు చేశారు. బస్తాల్లో తూకం తక్కువగా ఉండడంతో మూడు ఎరువుల దుకాణాలు, ఐదు బియ్యం షాపులపై కేసులు నమోదు చేసినట్టు తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ రామచంద్రరావు తెలిపారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ భాస్కర్, సిబ్బంది శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హృద్రోగికి బొడ్డేడ రూ.50వేల సాయం



రామకృష్ణ కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక: అనారోగ్యంతో బాధపడుతున్న మునగపాక గ్రామానికి చెందిన హృద్రోగి దొడ్డి రామకృష్ణ చికిత్సకు గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ రూ.50వేల సాయం అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన రామకృష్ణకు గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు అవసరమయ్యే సాయం అందించేందుకు పలువురు ముందుకొస్తున్నారు. దీనిలో భాగంగా రామకృష్ణ కుటుంబ సభ్యులకు తనవంతు సాయంగా ప్రసాద్ రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, మునగపాక ఉత్సవకమిటీ చైర్మన్ బొడ్డేడ అప్పలనాయుడు, పెంటకోట శ్రీనివాసరావు, అప్పలనాయుడు మిత్రమండలి సభ్యులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు విస్తరణ పనులకు మోక్షం

- రూ. 112 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- ఇప్పటి వరకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఆదిలోనే నిలిచిన పనులు
- త్వరలో పునః ప్రారంభానికి చర్యలు
- ఆరు నియోజకవర్గాలకు మెరుగుపడనున్న ప్రధాన రహదారి



పనులు పునఃప్రారంభించేందుకు రోడ్డును గురువారం పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, నిర్మాణ సంస్థ అధినేత ధర్మతేజ



విస్తరించనున్న బీఎన్ రోడ్డు

చోడవరం: ఎట్టకేలకు బీఎన్ రోడ్డు విస్తరణ పనులకు మోక్షం కలిగింది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో రోడ్డు పనులు పునః ప్రారంభించేందుకు కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టింది. జిల్లాలో ఆరు నియోజకవర్గాలకు ప్రధాన రహదారిగా ఉన్న భీమిలి వయా చోడవరం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డు గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పెద్దపెద్ద గోతులతో ప్రమాదకరంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రహదారిని విస్తరించాలని నిర్ణయించింది. అనకాపల్లి–చోడవరం రోడ్డులో ఉన్న గంధవరం నుంచి వెంకన్నపాలెం వరకు, అక్కడ బీఎన్‌రోడ్డును అనుసంధానం చేస్తూ ప్రస్తుతం ఉన్న రోడ్డును కలుపుకొని ఏడు మీటర్ల వెడల్పు చేస్తూ రోలుగుంట వరకూ విస్తరించేందుకు నిర్ణయించింది. 48 కిలోమీటర్ల పొడవున ఈ రోడ్డును విస్తరించేందుకు నిర్ణయించి, గత ఏడాది రూ.112కోట్లు మంజూరు చేసింది. ఈ పనులకు టెండర్లు దక్కించుకున్న ఎస్ఆర్‌సీ కాంట్రాక్టు సంస్థ సకాలంలో పనులు చేపట్టకపోవడంతో ఆదిలోనే కొంత జాప్యం ఏర్పడింది. తర్వాత పనులు ప్రారంభించి వడ్డాది నుంచి రావికమతం మధ్యలో కొంత మేర రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టిన ఆ సంస్థ మళ్లీ మధ్యలో పనులు పూర్తిగా నిలిపివేసింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నిలిచిపోవడంతో అప్పటికే దెబ్బతిన్న ఈ రోడ్డు గత కొంత కాలంగా కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిని పెద్దపెద్ద గోతులతో ప్రమాదకరంగా మారింది. వాహనచోదకులు, ప్రయాణికులు ఇబ్బందులను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇటీవల ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. చోడవరం, నర్సీపట్నం, మాడుగుల నియోజవర్గాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాడేరు, అరుకు ఏజెన్సీ ప్రాంతాలకు, మైదానప్రాంతంలో విశాఖపట్నం, అనకాపల్లి నియోజకవర్గాలకు ఇదే ప్రధాన రహదారి. ఈ పనులపై రాష్ట్ర ప్రభుత్వం చొరవతీసుకుంది. రోడ్డు పనుల్లో ఎటువంటి జాప్యంచోటుచేసుకోకూడదని, వెంటనే పనులు చేపట్టి పూర్తిచేయాలని సంబంధిత నిర్మాణ సంస్థను తాజాగా హెచ్చరించింది. దీంతో హుటాహుటిన పనులు చేపట్టేందుకు నిర్మాణ సంస్థ చర్యలు చేపట్టింది.

దీనిలో భాగంగా ప్రస్తుతం ఈ రోడ్డు ఏవిధంగా ఉంది, పనులు పునః ప్రారంభించేందుకు ఏ విధమైన చర్యలు చేపట్టాలనే విషయాలను పరిశీలించేందుకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీతో కలిసి నిర్మాణసంస్థ కాంట్రాక్టర్ ధర్మతేజ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో జాప్యం కారణంగా ఏర్పడిన గోతులను సంబంధిత కాంట్రాక్టర్‌కు రావికమతం, బుచ్చెయ్యపేట మండలాల్లో నాయకులు చూపించారు. ఇబ్బందులకు గురవుతున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేయాలని వారు కోరారు. పనులు వెంటనే ప్రారంభిస్తున్నట్టు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చెప్పారు.

48 కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రోడ్డులో ప్రధాన గ్రామాలు ఉన్న చోట సుమారు 10 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు, మిగతా 38 కిలోమీటర్లు బీటీ రోడ్డు (తారురోడ్డు) వేయాలనే నిబంధన ఉంది. దీంతో ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మొదటగా సీసీ రోడ్డు వేసి, వర్షాలు తెరుపిచ్చాక బీటీ రోడ్డు వేసేందుకు సదరు సంస్థ ప్రణాళిక సిద్ధం చేసుకుంది. సీసీ రోడ్డు పనుల కోసం సమీపంలో ప్లాంట్ ఏర్పాటుకు చోడవరం, కోమళ్లపూడి ప్రదేశాల్లో స్థలపరిశీలన కూడా చేసింది. వారం రోజుల్లో రోడ్డు పనులు పునఃప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గత కొంతకాలంగా అసంపూర్తిగా నిలిచిపోయిన బీఎన్‌రోడ్డు నిర్మాణపనులు త్వరలో వేగవంతమయ్యే అవకాశం ఉంది. ఈ రోడ్డు పనులు పూర్తయితే ఈ ఆరు నియోజకవర్గాల ప్రజలకు రాకపోకల కష్టాలు తీరనున్నాయి.

సీసీ రోడ్డు వేసే ప్రదేశాలను గుర్తించాం

వివిధ కారణాలతో నిర్మాణంలో జాప్యం చోటుచేసుకున్న బీఎన్‌రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభించేందుకు కాంట్రాక్టు సంస్థ చర్యలు చేపట్టిందని ఆర్ అండ్‌బీ డీఈఈ ధనుంజయ్ చెప్పారు. పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు ప్రభుత్వం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టామన్నారు. మొదటగా సీసీ రోడ్డు ఎక్కడెక్కడ వేయాలనేది గుర్తించడం జరిగిందన్నారు. రోడ్డు పనులు వేగంగా చేయాలని చర్యలు తీసుకున్నామని డీఈఈ చెప్పారు.

9మందికి రూ.85.90లక్షలు



జగనన్న విదేశీ విద్యాదీవెన చెక్కును విద్యార్థులకు అందిస్తున్న జేసీ జాహ్నవి

- జగనన్న విదేశీ విద్యాదీవెన నిధుల విడుదల

తుమ్మపాల: జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం కింద జిల్లాకు చెందిన 9 మంది విద్యార్థులకు రూ.85.90 లక్షలు విడుదలైనట్టు జేసీ ఎం.జాహ్నవి తెలిపారు. వెలగపూడి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో జగనన్న విదేశీ విద్యాదీవెన రెండవ విడత నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ వీక్షించి, లబ్ధిదారులకు నమూనా చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో ఒక ఎస్సీ, ఒక ఈబీసీ, ఆరుగురు బీసీ విద్యార్థులకు రూ.75,31,201 జమ చేయగా, 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఒక బీసీ విద్యార్థికి రూ.10,58,960 జమ చేసినట్టు తెలిపారు. జగనన్న విదేశీ విద్యాదీవెన పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. విద్యార్థులకు నాలుగు వాయిదాల్లో ప్రభుత్వం స్కాలర్‌షిప్ అందజేస్తున్నట్టు చెప్పారు. ఇమ్మిగ్రేషన్–కార్డు పొందాక తొలి వాయిదా, మొదటి సెమిస్టర్ ఫలితాల తర్వాత 2వ వాయిదా, రెండవ సెమిస్టర్ ఫలితాల తర్వాత 3వ వాయిదా, విజయవంతంగా చదువు పూర్తిచేసి మార్కులను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశాక చివరి వాయిదాను ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఏడాదికి రూ.8 లక్షల లోపు ఆదాయం కలిగిన కుటుంబాలు మాత్రమే అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు రూ.1.25 కోట్ల వరకు, ఇతరులకు కోటి రూపాయల వరకు ప్రభుత్వం విదేశీ విద్య దీవెన అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజేశ్వరి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి అజయ్‌బాబు, ఎస్టీ సహాయ సంక్షేమ అధికారి నాగశిరీష, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గంజాయిపై ప్రత్యేక దృష్టి



- ఎస్పీ మురళీకృష్ణ

యలమంచిలి: గంజాయి రవాణా నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించినట్టు ఎస్పీ జి.మురళీకృష్ణ తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు.రికార్డులను పరిశీలించి, పెండింగ్ కేసుల వివరాలను సీఐ షేక్ గఫూర్, ఎస్ఐ కె.పాపినాయుడులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైవే పై స్టాపర్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టినట్టు చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి హైవేపై పెట్రోలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి,మాదక ద్రవ్యాలు రవాణా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ పాల్గొన్నారు. గతంలో గుర్తు తెలియని యువకుడిని హత్య చేసి, శరీర భాగాలను యలమంచిలి మున్సిపాలిటీ కట్టుపాలెం ఊసల మదుం వంతెన కింద పడేశారు. ఆ ప్రాంతాన్ని ఎస్పీ సందర్శించి, కేసు దర్యాప్తు పురోగతి వివరాలను ఎస్ఐ, సీఐలను అడిగి తెలుసుకున్నారు.

41 మంది కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

- జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి బాలాజీ



తాళ్లపాలెం పీహెచ్‌సీని పరిశీలిస్తున్న జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నిర్మూలన అధికారి బాలాజీ

కశింకోట: జిల్లాలో కొత్తగా 41 మంది కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించినట్టు జిల్లా క్షయ, కుష్టు వ్యాధి నివారణ అధికారి(డీటీఎల్‌వో) ఎం.ఎస్.వి.కె. బాలాజీ తెలిపారు. మండలంలోని తాళ్లపాలెం పీహెచ్‌సీని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో నెల రోజులపాటు తమ ఆరోగ్య సిబ్బందితో కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు సర్వే నిర్వహించినట్టు తెలిపారు. 41 మందికి కొత్తగా వ్యాధి సోకినట్టు ఈ సర్వేలో గుర్తించామన్నారు. వీరిలో మండలంలో చింతలపాలెం గ్రామానికి చెందిన ఒకరు ఉన్నారన్నారు. క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని తెలిపారు. కుష్టు అంటు వ్యాధి అని, వ్యాధిగ్రస్తుడి శ్వాస నుంచి వెలువడే గాలి ద్వారా మరొకరికి సోకుతుందని చెప్పారు. వ్యాధిగ్రస్తులున్న చోట చుట్టు పక్కల మళ్లీ సర్వే జరుపుతామన్నారు. ఏడాదికి రెండు సార్లు జులై, డిసెంబర్ నెలల్లో సర్వే జరుపుతున్నట్టు తెలిపారు. ఇప్పటికి జిల్లాలో సుమారు 150 మంది కుష్టు వ్యాధిగ్రస్తులున్నారన్నారు.

హెల్త్ క్లినిక్‌లతో వైద్య సేవలు విస్తృతం

జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు సమర్థవంతంగా పని చేస్తున్నాయని బాలాజీ తెలిపారు. వీటి ఏర్పాటు తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సదుపాయాలు మెరుగుపడినట్టు చెప్పారు. హెల్త్ క్లినిక్‌లలో నైపుణ్యం కలిగి అవగాహన ఉన్న ఆరోగ్య సిబ్బంది, మందులు అందుబాటులో ఉంచి ఉచిత పరీక్షలు నిర్వహిస్తూ విశేషమైన సేవలందిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పని తీరును పరిశీలించారు. వైద్యాధికారి యు.రమేష్‌తో ఆస్పత్రి నిర్వహణపై సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

నిధులిస్తున్నా.. రోడ్లు బాగు చేయరా?





జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో సీఈవో శ్రీరామమూర్తి, సమావేశానికి హాజరైన జెడ్పీటీసీ సభ్యులు

- కారుకు ఉన్న నేమ్ బోర్డు తీసి తిరిగేలా చేయొద్దు
- కొంత మంది అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు
- స్థాయీ సంఘాల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర

మహారాణిపేట: గ్రామీణ రహదారుల గుంతలు పూడ్చడానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ఎందుకు పనులు చేపట్టడం లేదని అధికారులపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం స్థాయీ సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సుభద్ర మాట్లాడుతూ కొంత మంది అధికారులు వ్యవహరిస్తున్న తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందని, కొన్ని ప్రాంతాల్లో తన కారుకు ఉన్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పేరుతో ఉన్న బోర్డును తొలగించి తిరగాల్సి వస్తోందని చెప్పారు. వడ్డాది నుంచి మన్యం వరకు ఘాట్ రోడ్డు గుంతలతో నిండిపోయిందన్నారు. వారంలో రెండు రోజుల పాటు ఈ మార్గంలో తాను తిరుగుతున్నాట్టు చెప్పారు. రోడ్ల సమస్యను అనకాపల్లి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వచ్చే నెల 19న జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోగా రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు.

ప్రొటోకాల్‌పై సీఎంకు లేఖ

ప్రొటోకాల్ పాటించని అధికారులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాస్తామని సుభద్ర తెలిపారు. తొలుత భీమిలిలో ఇటీవల జరిగిన కేజీబీవీ పాఠశాల ప్రారంభోత్సవానికి తనను ఆహ్వానించలేదని జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు సభ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ స్పందిస్తూ జిల్లాలో జరిగే ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల సమయంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా ప్రొటోకాల్ పాటించాలని సూచించారు. ఈ విషయాన్ని కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. విశాఖ, అనకాపల్లి, ఏఎస్ఆర్ జిల్లాల అధికారులు కూడా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులను తప్పనిసరిగా పిలవాలని ఆమె కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ సేవలు అందుతున్నాయని జె.సుభద్ర తెలిపారు. ఇటీవల తనను పలువురు ప్రభుత్వ ఉద్యోగులు కలిసి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని కోరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇటీవల జెడ్పీ కార్యాలయ ఉద్యోగికి గుండెనొప్పి రావడంతో కేజీహెచ్‌లో చేరారని, వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ఆయన పూర్తిగా కోలుకున్నారని చెప్పారు. పద్మనాభం జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సర్కారు వైద్య రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నాడు–నేడు కింద కార్పొరేట్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దారని చెప్పారు. దీంతో పీహెచ్‌సీలకు రోగులు పెద్ద సంఖ్యలో వెళ్తున్నారన్నారు. దేవరాపల్లి జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం మాట్లాడుతూ కె.కోటపాడు పీహెచ్‌సీని కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దారన్నారు. కోటవురట్ల జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి మాట్లాడుతూ కోటవురట్లలో పీహెచ్‌సీని చాలా బాగా అభివృద్ధి చేశారన్నారు.

అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాఠశాలలకు భవనాల నిర్మాణంతో పాటు భాషా పండితులను నియమించాలని సుభద్ర కోరారు. దీనిపై డీఈవో చంద్రకళ స్పందిస్తూ 940 పాఠశాలలకు భవనాలు నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వ అనుమతి కోసం పంపామన్నారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులు కండ్ల కలకతో ఇబ్బంది పడుతున్నారని, తక్షణం చర్యలు తీసుకోవాలని చైర్‌పర్సన్ కోరారు. 5వ సంఘ చైర్మన్ ఈర్లె అనురాధ మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం లేదా ఐటీడీఏ నిధులతో గానీ మండలాల్లో అసంపూర్తిగా ఉన్న వివిధ భవనాలను పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో పి.శ్రీరామమూర్తి, ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డి.సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యులు, మూడు జిల్లాల అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి వ్యక్తిని ఓటరుగా నమోదు చేయాలి

- నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్



బూత్ అధికారి శ్రీనివాస్‌ను వివరాలు అడుగుతున్న ఆర్డీవో హనుమంత జయరామ్

నాతవరం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని నర్సీపట్నం ఆర్డీవో హనుమంత వెంకట జయరామ్ అన్నారు. నాతవరం పోలింగ్ కేంద్రం నంబరు 89 పరిధిలో ఓటరు సర్వేను ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్ సిబ్బంది ఏవిధంగా పనిచేస్తున్నారో ఇంటింటికీ వెళ్లి తెలుసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంతవరకు ఎంతమంది ఓటర్లను సర్వే చేశారని వీఆర్వో బొత్సా శ్రీనివాస్‌ను అడిగారు. మండల వ్యాప్తంగా ఉన్న 65 పోలింగ్ కేంద్రాల్లో సర్వే పక్కా జరగాలన్నారు. వచ్చే నెల 21 తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ఉంటుందని ఆర్డీవో తెలిపారు. పోలింగ్ బూత్ సిబ్బంది వెంట వలంటీర్లు, రాజకీయ నాయకులు వెళితే బూత్ అధికారులను సస్పెండ్ చేయడమే కాకుండా ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటింటా సర్వే చేసే సిబ్బందిపై పర్యవేక్షణ కోసం నియమించిన సూపర్‌వైజర్లు అంకిత భావంతో పని చేస్తే తప్పుఒప్పులు లేకుండా సర్వే విజయవంతంగా జరుగుతుందన్నారు.

ఆక్రమణకు గురైన ఆర్‌అండ్‌బీ స్థలం పరిశీలన

డి.యర్రవరం పంచాయతీలో ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి, భవనాలు నిర్మించిన ప్రదేశాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఈ స్థలం ఆక్రమణపై కొందరు స్పందనలో ఫిర్యాదు చేయడంతో స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వ భూములను ఆక్రమించడం నేరమన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా విలువైన భవనాలు ఎలా నిర్మించారని ప్రశ్నించారు. రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోక ముందే ఆక్రమణ స్థలాలను స్వచ్ఛందంగా ఖాళీ చేయాలని తెలిపారు.

హైస్కూల్ తనిఖీ

అనంతరం హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ప్రాంగణంతో పాటు గదులను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. విద్యా కానుక కిట్ల పంపిణీపై ఆరా తీశారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు, ఎంఈవో కామిరెడ్డి వరహాలబాబు, వీఆర్వో బి.శ్రీను పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో నాణ్యమైన దిగుబడులు



ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణనిస్తున్న నిర్వాహకులు

అనకాపల్లి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని, మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి జాగ్రత్తలు తీసుకుంటే నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ అధికారి సీహెచ్ లచ్చన్న అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడానికి అనేక రాయితీలను ఇస్తోందన్నారు. మండలంలోని తుమ్మపాల శ్రీనివాస కల్యాణమండపంలో గురువారం రైతు శాస్త్రవేత్తల శిక్షణ శిబిరం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇందులో రిటైర్డ్ ఐఏఎస్ , రైతు సాధికార సంస్థ ఈడీ టి.విజయ్ కుమార్ జూమ్ కాల్ ద్వారా మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో తక్కువ ఖర్చుతో మేలైన దిగబడులు సాధించేలా పంటలను ఎలా సాగు చేయాలో తెలియజేశారు. ఏడాది పొడవునా పంటలు పండించే రైతులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి, రైతు శాస్త్రవేత్తలుగా తయారు చేయాలని సూచించారు.ఇందులో ప్రాజెక్ట్ రీజనల్ కో-ఆర్డినేటర్ కష్టారావు,టెక్నికల్‌లీడ్ ప్రకాషరావు, రీజనల్ టెక్నికల్‌ఆఫీసర్ హేమసుందర్, రాష్ట్ర రిసోర్స్ పర్సన్ దేవుళ్లు, భాస్కరరావు, సర్పంచ్ పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకట లక్ష్మి, చదరం నాగేశ్వరరావు, పీలా బుజ్జి, జిల్లా కో ఆర్డినేటర్ కీర్తి గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం (ఏపీ ఓపెన్ స్కూల్)లో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలకు అభ్యర్థుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్నట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఆగస్టు 31వతేదీ లోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకుని దగ్గరలో గల ఓపెన్ స్కూల్ సెంటర్‌కు వెళ్లి ఒరిజనల్ సర్టిఫికెట్‌లు సమర్పించి ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలన్నారు.

మహిళను దూషించిన రౌడీషీటర్‌పై కేసు నమోదు

రావికమతం : తహసీల్దార్ కార్యాలయం వద్ద విచారణకు హాజరైన ఒక మహిళపై అసభ్య పదజాలంతో దూషించి, అంతు చూస్తానని బెదిరించిన రౌడీ షీటర్ మల్లేటి రమణపై కేసు నమోదు చేసినట్టు రావికమతం ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు గురువారం తెలిపారు. వివరాలివి. కొత్తకోటకు చెందిన గరగా సత్యవతి ఈ నెల 15న రావికమతం తహసీల్దార్ కార్యాలయంలో ఒక విచారణకు హాజరైంది. అనంతరం ఇంటికి వెళ్తున్న ఆమెపై కొత్తకోట గ్రామానికి చెందిన రౌడీషీటర్ మల్లేటి రమణ తీవ్ర అసభ్య పదజాలంతో దూషించడమే కాక అట్రాసిటీ కేసులు నమోదు చేయించి నీ సంగతి తేలుస్తానంటూ బెదిరించాడు. దీంతో ఆమె రమణపై చర్యలు తీసుకుని రక్షణ కల్పించాలని ఫిర్యాదు చేయగా విచారణ అనంతరం కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మాచ్‌ఖండ్ కార్మికుల నిరసన

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో కాంట్రాక్టర్ పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు గురువారం భోజన విరామ సమయంలో నిరసన చేపట్టారు. రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘాల పిలుపు మేరకు ప్రాజెక్ట్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సమస్యలు పరిష్కరించకుంటే అన్ని కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి సమ్మెకు దిగుతామని కార్మిక సంఘం ప్రతినిధి కె.సూర్యప్రకాష్ తెలిపారు.

ఏవోబీలో రెడ్ అలెర్ట్

మావోయిస్టు పార్టీ అమర వీరుల వారోత్సవాలు ఈ నెల 28 నుంచి వచ్చే నెల 3 వరకు జరగనున్న నేపథ్యంలో ఏవోబీతోపాటు సరిహద్దు చత్తీస్‌గఢ్ ప్రాంతంలోను పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. పోలీసు బలగాలు కూంబింగ్ ముమ్మరం చేశాయి. అణువణువూ గాలింపు చేపట్టాయి. వారోత్సవాలు, సంస్మరణ సభల నిర్వహణపై మావోయిస్టు కీలక నేతలు కటకం సుదర్శన్, ఎల్ఎస్ఎన్ మూర్తి, సుంద్రి, మంగో, ఉమేష్ ఫొటోలతో ఆంధ్రా, ఒడిశా స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి గణేష్ పేరిట ఇటీవల ప్రకటన విడుదలైంది. దీంతో పోలీసుశాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది.

- నేటి నుంచి మావోయిస్టు పార్టీ అమరవీరుల వారోత్సవాలు
- అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం
- కూంబింగ్ విస్తృతం
- డ్రోన్ కెమెరాలతో నిఘా



మావోయిస్టు పార్టీ కీలక నేతల ఫొటోలతో విడుదల చేసిన అమర వీరుల వారోత్సవాల కరపత్రం



ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మోహరించిన పోలీసు బలగాలు

సాక్షి,పాడేరు: ఒడిశాలోని మల్కన్‌గిరి, కోరాపుట్ జిల్లాలతో పాటు,చింతూరుకు సరిహద్దు చత్తీస్‌గఢ్, జిల్లాలోని పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, చింతూరు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో పోలీసుశాఖ భద్రత చర్యలను విస్తృతం చేసింది. చింతూరుకు సరిహద్దు చత్తీస్‌గఢ్, ఏవోబీ ప్రాంతాలను రెండు స్టేజ్‌లుగా విభజించి బలగాలను అప్రమత్తం చేశారు. కేంద్ర హోంశాఖ,ఇంటిలిజెన్స్ విభాగాలు తెలంగాణ,చత్తీస్‌గఢ్ రాష్ట్రాలనుఅప్రమత్తం చేయడంతో దండకారణ్యంలో పోలీసు బలగాలు గాలింపు చర్యల్లో నిమగ్నమయ్యాయి. కేంద్ర బలగాలు అడవిలో జల్లెడ పడుతున్నాయి. పోలీసు అవుట్ పోస్టులు,పోలీసు స్టేషన్ల పరిధిలోను రెడ్ అలెర్ట్ అమలు చేస్తున్నారు.

వర్షాలు కురుస్తున్నా..

సీఆర్‌పీఎఫ్‌తో పాటు ఇతర పోలీసు బలగాలను అదనంగా రంగంలోకి దింపారు.అవుట్ పోస్టులలో ప్రత్యేక బలగాలు మకాం వేసి సమీపంలోని అటవీ ప్రాంతాల్లో రోజువారీ కూంబింగ్ చర్యల్లో నిమగ్నమయ్యాయి.ఓ వైపు వర్షాలు కురుస్తున్నప్పటికీ పోలీసు పార్టీలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కూంబింగ్ పార్టీలకు తోడుగా డ్రోన్ కెమెరాలతో పాటు బాంబుస్క్వాడ్‌లు కూడా చురుగ్గా పనిచేస్తున్నాయి. ప్రధాన సెంటర్లలో వాహన తనిఖీలను ముమ్మరం చేశారు.

ప్రజాప్రతినిధులను అప్రమత్తం

ప్రజాప్రతినిధులు, హిట్ లిస్టులో ఉన్న నేతలను భద్రత కల్పించే దిశగా పోలీసుశాఖ అప్రమత్తం చేసింది. ఈ మేరకు నోటీసులు అందజేసింది. మావోయిస్టుల వారోత్సవాలు ముగిసేంత వరకు మారుమూల ప్రాంతాల పర్యటనలకు వెళ్లవద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని పోలీసుశాఖ తగిన హెచ్చరికలు జారీ చేసింది. అనుమానిత వ్యక్తుల సంచారంపై కూడా ప్రజాప్రతినిధులు, ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరింది.

మారుమూల ప్రాంతాలకు బస్సుల నిలిపివేత

మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నిలిపివేతతో పాటు నైట్‌హాల్ట్ సర్వీసులను గురువారం నుంచి ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ అధికారుల రద్దు చేశారు. కొన్ని ఆర్టీసీ సర్వీసులను మండల కేంద్రాల వరకు నడపనున్నారు.

వారోత్సవాలను అడ్డుకుంటాం



మావోయిస్టుల ప్రాబల్యం తక్కువగా ఉన్నప్పటికీ వారు తలపెట్టిన అమర వీరుల వారోత్సవాలను అడ్డుకుంటాం. ప్రజలంతా అభివృద్ధిని కోరుకుంటున్నారు. మావోయిస్టుల పట్ల వారంతా వ్యతిరేకంగానే ఉన్నారు. వారోత్సవాలతో ప్రజలకు ఒరిగిందేమి లేదు. ఏవోబీ అంతా రెడ్ అలర్ట్‌ను అమలుజేస్తున్నాం. ప్రజాప్రతినిధులు, హిట్ లిస్టులో ఉన్న నేతలకు భద్రత కల్పిస్తున్నాం.

– తుహిన్ సిన్హా, ఎస్పీ, పాడేరు

పేద, మధ్య తరగతిలోనే క్యాన్సర్ మరణాలు

- హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి అంకాలజీ విభాగ అధిపతి డోల్‌రోసా ఫెర్నాండెజ్



సదస్సుకు హాజరైన ప్రజలు

అనకాపల్లి టౌన్: ముడింట రెండొంతుల క్యాన్సర్ మరణాలు పేద, మధ్య తరగతి ప్రజల్లోనే సంభవిస్తున్నాయని హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి, అగనంపూడి క్యాన్సర్ పరిశోధనా కేంద్రం అంకాలజీ విభాగం అధిపతి డోల్‌రోసా ఫెర్నాండెజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ తల, గొంతు క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా గురువారం రాత్రి స్థానిక గౌరీ గ్రంథాలయంలో క్యాన్సర్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వారసత్వంగా క్యాన్సర్ వ్యాధి ఐదు శాతం మందికి మాత్రమే వస్తుందన్నారు. జీవకణాల అసాధారణ పెరుగుదల వల్ల కలిగేది ప్రాణాంతకమైన క్యాన్సర్ అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అటామిక్ ఎనర్జీ విభాగం , టాటా మెమోరియల్ సెంటర్ సహకారంతో అగనంపూడిలో 70 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన హోమీబాబా ఆస్పత్రి, రీసెర్చ్ సెంటర్ తక్కువ ధరకే రోగులకు వైద్య సేవలందిస్తుందన్నారు. కొన్ని సందర్భాల్లో శరీరంలో కణాల పెరుగుదల్లో నియంత్రణ లేనందు వల్ల అవి అస్తవ్యస్తంగా విభజన చెందడంతో కంతి(ట్యూమర్)గా మారుతుందని పేర్కొన్నారు. రొమ్ము, మెడ, తల, గర్భాశయం, పొగాకు సంబంధిత నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, పేగులు, శ్వాసనాళాల్లో క్యాన్సర్ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అంతకుముందు ఆమెను గ్రంథాలయ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, ఉపాధ్యక్షుడు కాండ్రేగుల జగ్గారావు, రోటరీ క్లబ్ ఉపాధ్యక్షుడు కె.రామ్మోహనరావు, ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కె.ఎస్.వి.సత్యనారాయణ, మళ్ల బాపునాయుడు, భీశెట్టి కృష్ణ అప్పారావు పాల్గొన్నారు.

కాలుజారి పడి కార్మికుడి మృతి

రాంబిల్లి: యునిపార్ట్స్ కంపెనీలో గురువారం రేకుల షెడ్డు వేస్తుండగా ఎండీ మెహబూబ్ అలీ(34) ప్రమాదవశాత్తూ కాలిజారి పడిపోయి అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. తోటి కార్మికులతో కలిసి మెహబూబ్ అలీ పాత రేకులు తీసి కొత్త రేకులు వేస్తుండగా కాలిజారి పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అలీని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. కూర్మన్నపాలెం సమీపంలో గల ఇస్లాంపేటకు చెందిన మెహబూబ్ అలీకి భార్య, ఒక బాబు ఉన్నారు. కాగా మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.



ఎండి మెహబూబ్ అలీ

రైవాడకు భారీగా వరద నీరు

- కొనసాగుతున్న 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

దేవరాపల్లి: రైవాడ జలాశయంలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో భారీగా వర్షాలు కురుస్తుండడంతో వరదనీరు పోటెత్తుతోంది. ప్రస్తుతం జలాశయంలోకి 1800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయం గరిష్ట నీటిమట్టం 114 మీటర్లు కాగా, ప్రస్తుతం 110 మీటర్లకు చేరుకుంది. ఇదే ఇన్‌ఫ్లో కొనసాగితే రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయికి నీటిమట్టం చేరుకునే అవకాశం ఉంటుందని జలాశయం పర్యవేక్షణ ఇంజనీరింగ్ అధికార్లు చెబుతున్నారు. జలాశయం నీటిమట్టం 113.50 మీటర్లకు చేరుకుంటే వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా రెగ్యులేటింగ్ గేట్లు ద్వారా శారదానదిలోకి నీటిని విడుదల చేసే అవకాశం ఉంటుందని వారు చెప్పారు.

స్వాతంత్య్ర సమరయోధుల కుటుంబాలకు సొంతిళ్లు

కొయ్యూరు: స్వాతంత్య్ర సమరయోధుల మునిమనమళ్లకు సొంత ఇంటి కల సాకారం కాబోతోంది. క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం లంకవీధిలో ఇళ్లు నిర్మించనున్న ప్రాంతాన్ని మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు పరిశీలించారు. అల్లూరితో కలిసి పోరాటం చేసిన గాం గంటన్న, మల్లుదొర కుటుంబాలకు చెందిన 11 మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నారు. పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ మాధవి విజ్ఞప్తి మేరకు క్షత్రియ పరిషత్ ఆధ్వర్యంలో నాగార్జున నిర్మాణ సంస్థ ముందుకు వచ్చింది. ఆ సంస్థ కన్సల్టెంట్ ఎంపీ రాజు, ఎంపీపీ బడుగు రమేష్‌బాబు, మండల పార్టీ అధ్యక్షులు జల్లి బాబులు ఇళ్లు నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. క్షత్రియ పరిషత్ సభ్యులు బంగారు రాజు, ప్రదీప్‌వర్మ, నడింపల్లి నానిరాజు, చక్రపాని రాజు, నాగేంద్రరాజు, ఎంపీటీసీ మల్లేశ్వరి, సర్పంచ్ బాలకృష్ణ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న క్షత్రియ పరిషత్ సభ్యులు, సూర్యనారాయణరాజు తదితరులు

విస్తృత తనిఖీలు



జోలాపుట్టులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: ఏవోబీ సరిహద్దు ప్రాంతంలో ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో గురువారం సీఆర్‌పీఎఫ్ పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. ముంచంగిపుట్టు నుంచి బాపనపుట్టు, కర్రిముఖిపుట్టు గ్రామాల వరకు కల్వర్టులు, వంతెనలను బాంబు స్క్వాడ్‌తో పరిశీంచారు.

కలప అక్రమ రవాణాపై రూ.2.65 లక్షలు జరిమానా

దేవరాపల్లి : టేకు కలపను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తికి రూ.2.65 లక్షల అపరాధ రుసుము విధించినట్టు చోడవరం రేంజర్ ఇ.వి.వర్మ తెలిపారు. అటవీశాఖ చెక్ పోస్టు వద్ద బుధవారం రాత్రి రెండు వాహనాలతో పట్టుబడిన కలపను తన సిబ్బంది సహకారంతో గురువారం లెక్కించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ అనంతగిరి మండలం నుంచి అక్రమంగా తరలిస్తున్న 104 టేకు దుంగలను స్వాధీనం చేసుకుకొని, కేసు నమోదు చేసి, రెండు వాహనాలను సీజ్ చేశామని తెలిపారు.



పట్టుబడిన టేకు దుంగలను సిబ్బందితో కొలతలు వేయిస్తున్న అటవీశాఖ చోవడరం రేంజర్ వర్మ

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్ : స్థానిక శారదానది రైల్వేబ్రిడ్జిపై గుర్తు తెలియని వ్యక్తిని గురువారం మృతి చెందాడు. దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ కె.శాంతారాం అందించిన వివరాలిలా ఉన్నాయి. యలమంచిలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న రైలు సదరు వ్యక్తిని ఢీకొంది. ఈ ఘటనలో ఆ వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతునికి 45 సంవత్సరాలు ఉంటాయని, గ్రీన్ కలర్‌ఫ్యాంట్, చెక్స్‌షర్ట్ ధరించి ఉన్నాడని, మెడలో యజ్ఞోపవీతం ఉందని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మావోయిస్టులకు వ్యతిరేకంగా కరపత్రాలు

కొయ్యూరు/పెదబయలు/జి.మాడుగుల: మావోయిస్టులకు వ్యతిరేకంగా కొయ్యూరు మండలంలో రాజేంద్రపాలెం, కొయ్యూరు, గుడ్లపల్లి, మంప, రేవళ్లు, బూదరాళ్ల, పెదబయలు మండలం సీతగుంట, పెదబయలు. బొంగరం, ఇంజరి, జి.మాడుగుల మండలం మద్దిగరువు, నుర్మతి, జి.మాడుగుల ప్రాంతాల్లో అల్లూరి ఆదివాసీ యువజన సంఘం పేరిట కరపత్రాలు వెలిశాయి. అమాయక గిరిజనులను ఇన్‌ఫార్మర్ల నెపంతో చంపుతున్నారని, ఈ నేపథ్యంలో వారోత్సవాలు వద్దని, సెల్ టవర్లను పేల్చి గిరిజన యువతకు అందుతున్న ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తున్నారని, రోడ్లు రాకుండా అడ్డుకుని అభివృద్ధిని దూరం చేస్తున్నారని వాటిలో పేర్కొన్నారు.

జి.మాడుగుల: మండలంలో పాడేరు–జి.మాడుగుల,చింతపల్లి, నుర్మతి, మద్దిగరువు రోడ్డు మార్గాల్లోని కల్వర్టు, బ్రిడ్జిలు, అనుమానిత ప్రాంతాల్లో గురువారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నుర్మతి రోడ్డు మార్గంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద, పాడేరు రోడ్డు మార్గంలో మత్స్యపురం జంక్షన్ వద్ద ఎస్‌ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు.

హత్య కేసులో నిందితుల లొంగుబాటు

- రిమాండ్‌కు తరలింపు



హత్య కేసు నిందితుడితో సీఐ రుద్రశేఖర్, ఎస్‌ఐ సంతోష్

అరకులోయటౌన్: హత్య కేసులో నిందితుడు పాంగి రాజు (43) మంగళవారం అరకులోయ పోలీస్‌స్టేషన్‌లో సీఐ సీహెచ్.రుద్రశేఖర్ ఎదుట లొంగిపోయాడు. సీఐ అందించిన వివరాలివి. మండలంలోని బస్కీ పంచాయతీ మొర్రిగుడ గ్రామానికి చెందిన పాంగి రాజు తన భార్యతో తరచూ గొడవలు పడేవాడు. గ్రామంలోని ప్రజలతో కూడా తరచూ గొడవలు పడేవాడు. ఈనెల 25వ తేదీన నిందితుడు పాంగి రాజు తన భార్యతో గొడవలు పడుతుండగా తన ఇంటి ఎదుట నివాసం ఉంటున్న పాంగి కొములు (76) కలుగజేసుకొని ఎందుకు చీటికి మాటికి నీ భార్యతో గొడవలు పడుతుంటావని వారించాడు. దీనిని మనసులో పెట్టుకొని అదే రోజు రాత్రి 9 గంటల సమయంలో వరండాలో పడుకున్న పాంగి కొములును సమీపంలోని కమ్మరశాల వద్దకు తీసుకువెళ్లి మెడ పట్టుకొని భూమిపై గట్టిగా అన్ని ఉంచడంతో కొములు అక్కడికక్కడే చనిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని, అంతలో నిందితుడు రాజు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోయాడన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారని తెలిపారు. విలేకరుల సమావేశంలో అరకులోయ ఎస్‌ఐ ఆర్.సంతోష్ పాల్గొన్నారు.

చేతబడి నెపంతోనే హత్య

- గిరిజన మహిళ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు
- సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం పూర్తి





సంఘటన స్థలంలో వెలికితీసిన బున్నమ్మ మృతదేహం

మారేడుమిల్లి : చేతబడి చేస్తుందనే నెపంతో చావడికోట పంచాయతీ పరిధిలోని బంధ గ్రామానికి చెందిన పల్లాల బున్నమ్మ (53) అనే గిరిజన మహిళను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు తాడుతో గొంతు నులిమి హత్య చేసి మృతదేహాన్ని అడవి ప్రాంతంలో పూడ్చి పెట్టారు. గత ఆదివారం జరిగిన ఈ దారుణం ఆలస్యంగా బుధవారం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. గురువారం స్థానిక సీఐ రమేష్, మారేడుమిల్లి, గుర్తేడు ఎస్‌ఐలు రాము, జ్వాలసాగర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి మృతదేహాన్ని పూడ్చిన ప్రదేశాన్ని గుర్తించి బయటకు తీశారు. అప్పటికే ఐదు రోజులు కావడంతో మృతదేహం పాడైపోయి దుర్వాసన వస్తుంది. ఎమ్మార్వో శ్రీనివాసరావు సమక్షంలో రంపచోడవరం ఏరియా ఆస్పత్రి వైద్యులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలు ప్రకారం బంధ గ్రామానికి చెందిన సాదల రామిరెడ్డి, నీలపు రెడ్డి, బొర్రం రెడ్డి ముగ్గురు వ్యక్తులు అన్నదమ్ముళ్లు. వీరికి మృతురాలు పల్లాల బున్నమ్మ వరుసకు అక్క అవుతుంది. రామిరెడ్డి భార్య సాదల అమ్మయమ్మ రెండేళ్లుగా బోన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఆమెను భర్త ఓ భూత వైద్యుడికి చూపించగా చేతబడి చేశారని చెప్పడంతో బున్నమ్మే చేతబడి చేసి ఉంటుందనే అనుమానంతో ముగ్గురు వ్యక్తులు కలిసి బున్నమ్మను హత్య చేశారు. నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు..

గంజాయితో ముగ్గురి అరెస్టు

అరకులోయ టౌన్ : అరకులోయ పోలీసులు గురువారం 22 కిలోల గంజాయితో ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. సీఐ రుద్రశేఖర్ అందించిన వివరాలివి. ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ ఆర్.సంతోష్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్దకు వెళ్లి తనిఖీ చేయగా 22 కిలోల గంజాయితో న్యూఢిల్లీకి చెందిన శివకుమార్(61), పంజాబ్‌కు చెందిన మన్‌ప్రీత్ (34), తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డికి చెందిన ఎస్.రమేష్(21) అనే ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారన్నారు. వీరంతా అరకులోయ పరిసరాల్లో గంజాయి కొనుగోలు చేసి ఢిల్లీలో చేరవేసేందుకు వచ్చినట్టు విచారణలో తేలిందన్నారు. వారిని కోర్టుకు హాజరు పరిచి రిమాండ్ తరలిస్తామన్నారు. ఎస్‌ఐ సంతోష్ పాల్గొన్నారు.

ఒడిశా బోర్డుల తొలగింపు

ముంచంగిపుట్టు: ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు జలాశయం సమీపంలో ఏర్పాటుచేసిన ఒడిశా రాష్ట్రానికి చెందిన స్వాగతం బోర్డులను మండల అధికారులు తొలగించారు. ఆంధ్రా భూభాగంలో స్వాగతం బోర్డులు ఏర్పాటు చర్చనీయాంశంగా మారడంతో జిల్లా అధికారులు స్పందించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో ఎంపీడీవో రమేష్, తహశీల్దార్ నర్సమ్మ, జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ రవీంద్ర, సర్పంచులు నీలకంఠం, గంగాధర్ గురువారం జోలాపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లి ఒడిశా అధికారులతో మాట్లాడారు. ఆంధ్ర భూ భాగంలో ఒడిశా బోర్డుల ఏర్పాటుపై చర్చించారు. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన బోర్డులను వెంటనే తొలగించాలని వారు సూచించారు. ఒడిశా అధికారుల సమక్షంలో బోర్డులు తొలగించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఏఎస్‌ఐ తిరుపతిరావు, వీఆర్వో మోహన్, సర్వేయర్ సుజాత పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ ఇ-చలానాలపై స్పెషల్ డ్రైవ్



ద్విచక్రవాహనానికి ఇ-చలానా రాస్తున్న ఎస్‌ఐ రమేష్

అనకాపల్లిటౌన్: ద్విచక్రవాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే సహించేది లేదని ట్రాఫిక్ ఎస్‌ఐ జె.రమేష్ హెచ్చరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆయన గురువారం సాయంత్రం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-చలానా చెల్లించని 150 వాహనాల నుంచి చలానా చెల్లించేలా చర్యలు చేపట్టామన్నారు. చలానాల రూపంలో రూ.30 వేలు ఆదాయం సమకూరిందన్నారు.

గంబూసియా చేపలతో దోమల నియంత్రణ



గంబూసియా చేపల్ని బావిలో విడిచిపెడుతున్న భాస్కర్

అనకాపల్లిటౌన్: గంబూసియా చేపలతో దోమలను నిరోధించవచ్చని 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ అన్నారు. పట్టణంలోని గవరపాలెం శాంతినగర్ బావిలో గురువారం ఆయన గంబూసియా చేపలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలున్న ప్రాంతంలో ఈ చేపలను వేస్తే దోమల లార్వాను ఇవి తినడం ద్వారా, దోమల వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ శానిటరీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కశింకోట: మండలంలోని నరసింగబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండబోదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ రహదారిపై విద్యుత్ కండక్టర్ మారిృడి పనులు నిర్వహించనున్న దృష్ట్యా నూతలగుంటపాలెం, త్రిపురవానిపాలెం, అచ్యుతాపురం తదితర గ్రామాల్లో గృహ, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని గమనించి సహకరించాల్సిందిగా కోరారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు గురువారం 137 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,850	3,920
మూడోరకం	---	---

అనకాపల్లి సినిమాలు

బేబి	: రాజా
బ్రో	: సత్యనారాయణ స్క్రీన్-1
మహావీరుడు	: సత్యనారాయణ స్క్రీన్-2
బ్రో	: షిర్డిసాయి
మిషన్ ఇంపాజిబుల్ (తెలుగు)	: పర్తిసాయి
బ్రో	: వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో	: శ్రీసత్య
బ్రో	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 52 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-19 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-6 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ప్రకృతి సాగు.. రాబడి బాగు

మండలంలోని సరుగుడు సాగు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయం ద్వారా 18 రకాల కాయగూరలు, ఆకు కూరలు, పప్పు దినుసులు వగైరా ఆహార ఉత్పత్తుల సాగు చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ విభాగం ఆరోగ్యకరమైన ఆహార పంటలు పండించేలా సరుగుడు రైతులను ప్రోత్సహిస్తోంది. ఇందుకు సింగవరం గ్రామం వేదికగా మారింది.

- సరుగుడు భూముల్లో ప్రకృతి వ్యవసాయం
- ప్రయోగాత్మకంగా సింగవరంలో అమలు
- 18 రకాల ఆకుకూరలు, కూరగాయల సాగు



ప్రకృతి వ్యవసాయం సాగుకు భూమిని దున్ని సిద్ధం చేస్తున్న మహిళా రైతులు

కశింకోట: మండలంలోని 14 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు. సుమారు 1800 ఎకరాల్లో కొనసాగుతోంది. దీనిలో భాగంగా కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులు తదితర పంటలను ప్రకృతి సిద్ధంగా పండిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను ప్రజలకు అందిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుండటంతో రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు.

సరుగుడు స్థానంలో ప్రకృతి వ్యవసాయం

మండలంలోని సింగవరం లాంటి కొన్ని గ్రామాల్లో ఇతర పంటలతోపాటు వాణిజ్య పంటగా 423 ఎకరాల్లో సరుగుడు సాగవుతోంది. సరుగుడు సాగు వల్ల నాలుగైదేళ్లకుగానీ ఆదాయం రాదు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆహార పంటల సాగు చేపడితే ఏటీఎంలా రోజూ ఆదాయం పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులను ప్రోత్సహిస్తున్నారు. పైగా సరుగుడు సాగుతో ఆహార ఉత్పత్తులు తగ్గి, ఆహార కొరత ఏర్పడుతుందని, దీన్ని నివారించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయంలో 18 రకాల ఆకుకూరలు, కూరగాయల పంటలు వేయడం ద్వారా స్వల్ప కాలంలో పంట రావడంతో పాటు, అప్పటి నుంచి నిత్యం ఏదో ఒక పంట ద్వారా ఆదాయాన్ని పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చెప్తున్నారు. దీంతో రైతులు కూడా ప్రకృతి సాగుపై ఆసక్తి చూపుతున్నారు.

తక్కువ పెట్టుబడి.. ఎక్కువ దిగుబడి

ప్రకృతి సాగులో అధిక పెట్టుబడి అవసరమయ్యే కృత్రిమ ఎరువులతో పనిలేదు. తక్కువ ఖర్చుతో సొంతంగా తయారు చేసుకునే జీవామృతం, మీనామృతం, పశువుల గెత్తం తదితర సేంద్రియ ఎరువులతో పంటలు పండించి, అధిక లాభాలు పొందవచ్చు. ఈ విషయాలను ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు వివరించి, ప్రోత్సహించడంతో సింగవరం గ్రామంలో ప్రయోగాత్మకంగా ప్రకృతి వ్యవసాయం సాగించడానికి కొందరు ముందుకు వచ్చారు. వారి వ్యవసాయ క్షేత్రాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పర్యవేక్షణలో సాగు చర్యలు మొదలయ్యాయి. అడపా దడపా వర్షాలు కురవడంతో భూమిని చదును చేసి సిబ్బంది సూచించిన 18 రకాల విత్తనాలతో సాగు చేపట్టారు. ఇది సత్ఫలితాలిస్తే మిగిలిన రైతులు కూడా సరుగుడు సాగుకు స్వస్తి పలికి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల సాగు వైపు మళ్లుతారని అధికారులు, సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పదేళ్లుగా సరుగుడే ఆధారం



మాకున్న ఎకరం భూమిలో పదేళ్లుగా సరుగుడు సాగు చేస్తున్నాం. నాలుగైదేళ్లకు తోట కోతకు వస్తుంది. గతంతో సరుగుడు వల్ల ఆదాయం బాగానే వచ్చేది. ఇప్పుడు పోటీ, సాగు పెరిగి, ధర, రాబడి తగ్గింది. ప్రకృతి వ్యవసాయంలో ఎక్కువ ఆదాయం వస్తుందని అధికారులు ప్రోత్సహిస్తున్నారు. దీంతో ప్రయోగాత్మకంగా 18 రకాల పంటల సాగు చేపట్టాం. ఉత్పత్తి, లాభం బాగుంటే దీన్నే కొనసాగిస్తాం.

–సారిపల్లి చినబ్బాయి, రైతు, సింగవరం, కశింకోట మండలం

అరెకరంలో ప్రకృతి వ్యవసాయం



మాకు అర ఎకరం భూమి ఉంది. చాలా కాలంగా సరుగుడు సాగు చేస్తున్నాం. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు అందివ్వడంతోపాటు, క్రమం తప్పకుండా ఆదాయం పొందేందుకు ప్రకృతి వ్యవసాయంలో వీలవుతుందని అధికారులు చెప్పారు. విత్తనాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీ వరకు ప్రతి విషయంలోనూ ప్రోత్సహిస్తున్నారు. వారిచ్చిన ప్రోత్సాహంతోనే ప్రకృతి సాగులోకి దిగాం.

–పంచదార్ల నాగ అప్పలనరస, మహిళా రైతు, సింగవరం

సరుగుడుకు బదులుగా..

రాష్ట్ర వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగా సింగవరం గ్రామంలో సరుగుడు రైతులకు ప్రకృతి సాగుపేపు అవగాహన కల్పిస్తున్నాం. అధికారుల ఆదేశాల మేరకు 18 రకాల ఆహార పంటలను సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాం. ప్రాథమికంగా ఐదుగురు రైతులు ముందుకు వచ్చి సాగు చేపట్టారు. మిగిలిన రైతులకూ ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన వచ్చేలా మాట్లాడుతున్నాం. సరుగుడు సాగుకంటే ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుంది. అందుకే రైతులు కూడా ఆసక్తి చూపుతున్నారు.

–డి.రమణ, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి, కశింకోట

జగనన్న సురక్షతో సులభంగా ధ్రువపత్రాలు



మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న జెడ్పీ వెంకటరమణ, డీటీ శ్రీరామమూర్తి

అనకాపల్లిటౌన్: జగనన్న సురక్ష ద్వారా వివిధ రకాల ధ్రువపత్రాలను అతి సులభంగా పొందవచ్చని జెడ్సీ వెంకటరమణ అన్నారు. పట్టణంలోని 10, 11, 12 సచివాలయాల పరిధిలో స్థానిక నెయ్యిలవీధి సచివాలయంలో గురువారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటి వరకు 2,667 ధ్రువపత్రాలు అందించినట్టు పేర్కొన్నారు. ఈ నెల 29న స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ హైస్కూళ్లలో 9, 10 తరగతుల విద్యార్థినులు 2,500 మందికి ఒక్కోటి రూ.6 వేలు విలువ చేసే సైకిళ్లను పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. అరబిందో ఫార్మా సహకారంతో ఈ సైకిళ్లను రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా అందిస్తామన్నారు. సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు ఏం కావాలో తెలుసుకుని మరీ సంక్షేమ ఫలాలు అందిస్తున్న సీఎం జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. అభివృద్ధిపై పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావిస్తూ అనకాపల్లి పార్లమెంట్‌ను అభివృద్ధి పథాన నడిపిస్తున్న ఎంపీ సత్యవతిని మళ్లీ ఎంపీగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. అంతకుముందు వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి జెడ్సీ వెంకటరమణ, డీటీ శ్రీరామమూర్తి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, ఏపీవో దొర, ఆర్‌ఐ మర్రా చంద్రశేఖర్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, అధికసంఖ్య పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని తొలగించాలి



మణిపూర్ ఘటనలపై నిరసన తెలుపుతున్న దళిత విముక్తి నాయకులు

తుమ్మపాల: మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు అత్యంత హేయమని, ముఖ్యమంత్రి బీరేన్‌సింగ్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని నాలుగు రోడ్ల జంక్షన్ అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత విముక్తి ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర కన్వీనర్ సుర్ల వెంకటరమణ మాట్లాడుతూ దేశం మొత్తం తలదించుకునేలా మణిపూర్‌లో కుకీ తెగ మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. బీజేపీ అధికారంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలపై హత్యలు, అత్యాచారాలు విపరీతంగా పెరిగిపోయాయని ఆరోపించారు. దాడుల్ని నియంత్రించడంలో విఫలమైన అక్కడి ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత హక్కుల సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటరమణ, మహిళా ప్రతినిధి బి.సన్యాసమ్మ, దళిత నాయకులు కంకణాల శ్రీనివాసరావు, డీబీఎస్‌యూ కొల్లు సత్యారావు, ఎస్కే మదీనా పాల్గొన్నారు.

మళ్లీ పెరిగిన టమాటా ధర



కశింకోట: కశింకోటలో గురువారం జరిగిన వారపు సంతలో టమాటా ధర మళ్లీ పెరిగింది. గత వారం రూ.120కి తగ్గిన ధర ఈ వారం రూ.150కి చేరుకుంది. ఇక ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, వంకాయ రూ.30, బెండకాయ రూ.40, బీట్రూట్, క్యారెట్, కాకరకాయ, బీరకాయ రూ.60, క్యాప్సికం రూ.100, పచ్చిమిర్చి రూ.120కి అమ్మకాలు సాగాయి.

రైతుల శ్రేయస్సుకు కేంద్రం కృషి



రైతులకు సబ్సిడీ ఎరువులు అందిస్తున్న డాక్టర్ సత్యనారాయణ

తుమ్మపాల: రైతులకు యూరియా, డీఏపీ, పొటాష్ వంటి నాణ్యమైన ఎరువులను కొరత లేకుండా అందరికి అందుబాటులో ఉండేలా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు డాక్టర్ జీవీ సత్యనారాయణ తెలిపారు. కిసాన్ సమ్మాన్ నిధి పంపిణీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కర్ణాటక సుబ్రహ్మణ్యగుప్తా ఎరువుల దుకాణం(ప్రధాన మంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రం)ను ఆయన సందర్శించారు. రాజస్థాన్‌లో ప్రధాని మోదీ రైతులకు రూ.2 వేల జమ కార్యక్రమాన్ని టీవీ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. రైతులకు రాయితీపై ఎరువుల బస్తాలను అందించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ వుడా రమేష్, అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొండబాబు, కార్యదర్శి ఒ.నాగమణి, మండల అధ్యక్షుడు నర్సింగ్‌యాదవ్, రైతులు పాల్గొన్నారు.

దాడుల్ని అరికట్టడంలో కేంద్రం విఫలం



న్యాయ సముదాయం వద్ద నిరసనలో మాట్లాడుతున్న న్యాయవాది సాయిలక్ష్మణ్



నెహ్రూచౌక్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న బీఎస్పీ నేతలు

అనకాపల్లిటౌన్: మణిపూర్ మారణకాండను అదుపు చేయలేని అసమర్ధ ప్రభుత్వం కేంద్రంలో ఉందని న్యాయవాది సాయిలక్ష్మణ్ అన్నారు. మణిపూర్‌లో జరుగుతున్న దాడులకు స్థానిక న్యాయసముదాయం ముందు గురువారం న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింసను అదుపు చేయలేని పక్షంలో కేంద్రం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస్, మాధవరావు, సుధాకర్, గంగరాజు, నూకరాజు, సురేష్‌బాబు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో కేంద్రం విఫలం

దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడుల్ని అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని దళిత బహుజన శ్రామిక యూనియన్ జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు ఆరోపించారు. స్థానిక నెహ్రూచౌక్‌లో గురువారం దళిత బహుజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో గిరిజన మహిళపై జరిగిన దాడి బాధాకరమన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి దారుణాలు పునరావృతం కాకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు సేవ్ ఇండియా పేరిట ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి సూదికొండ మాణిక్యాలరావు, నేతలు దొమ్మేసి సత్యారావు, బండి అప్పారావు, కోరిబల్లి జగదీష్ పాల్గొన్నారు.

ఆదివాసీ వ్యతిరేక చట్టాలపై నిరసన

తుమ్మపాల: ఆదివాసీలకు వ్యతిరేకమైన చట్టాలను చేయడాన్ని నిరసిస్తూ రాష్ట్రీయ ఆదివాసీ ఏకతా పరిషత్(ఆర్‌ఏపీఎఫ్) సభ్యులు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. పార్లమెంట్ ద్వారా రాజ్యాంగ విరుద్ధమైన చట్టాలను వెనక్కి తీసుకోవాలని నినదించారు. ఆదివాసీల హక్కుల్ని కాలరాస్తే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఎరుకల పోరాట సమితి నాయకులు బండి రామస్వామి, ప్రదిమి వెంకటస్వామి, గంటా సుబ్బారావు, వుడమి వెంకట అప్పారావు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెం శివారు త్రిపురవానిపాలెంలో నగదు పణంగా పెట్టి పేకాట ఆడుతున్న శిబిరంపై గురువారం దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. వారి నుంచి రూ.7,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లో జూదం, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారముంటే తమకు తెలపాల్సిందిగా ప్రజలను కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్



పూసర్ల వీధిలో సిమెంట్ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

కశింకోట: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కశింకోటలోని 4వ సచివాలయ పరిధిలో కస్పావీధి, ఉప్పునీటి దిబ్బ, కుమ్మరివీధి ప్రాంతాల్లో గురువారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కుటుంబాల వారీగా అందిని లబ్ధిని గణాంకాలతో సహా తెలిపారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నియోజకవర్గంలో సమస్యల్ని తన దృష్టికి తీసుకు వస్తే, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. కశింకోటలో ఇంటింటి కుళాయిలను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకు రావడానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదని స్థానికులు మంత్రి దృష్టికి తెచ్చారు. దీంతో ఇంటింటి కుళాయిలకు నీరు సరఫరా అందాలంటే సుమారు రూ.2.5 కోట్లు ఖర్చవుతుందని అధికారులు వివరించారు. దీంతో ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు తనకు పంపించాలని మంత్రి ఆదేశించారు. జగనన్న ఇళ్ల మంజూరు, రోడ్లు, కాలువల నిర్మాణానికి ఆయన భరోసానిచ్చారు. భూముల రీ-సర్వే జరిపి, ఇచ్చిన పాసు పుస్తకాలతో భూముల రిజిస్ట్రేషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోదండ సీతారామస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు మంత్రిని కోరారు. స్థానిక సంతబయల కోళ్ల సంత నుంచి పూసర్ల వీధి వరకు రూ.10 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్డు, కాలువ, పూసర్ల వీధి నుంచి తగరం పూడి వారి వీధి వరకు సిమెంట్ రోడ్డును, ఉప్పునీటి దిబ్బ వద్ద బోరును మంత్రి ప్రారంభించారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. దుశ్శాలువాలు కప్పి, పూలు జల్లి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళ హారతులు పట్టారు. కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, ఉగ్గినపాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు, కశింకోట సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, అనకాపల్లి మండలాధ్యక్షుడు గొర్లి సూరిబాబు, ఉప సర్పంచ్ నడిపల్లి లక్ష్మి, ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ పెంటకోట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు నడిపల్లి నాయుడు, ఎంపీడీవో వీవీ రవికుమార్, తహసీల్దార్ జె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కార్యాలయం వద్ద గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, రెగ్యులర్ చేయాలని, బకాయి వేతనాలు వెంటనే చెల్లించి, వేతనాలను పెంచాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి పీవీ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్మిక సంఘ ప్రతినిధులు ఎం.త్రినాథరావు, రమణ, ప్రసాద్, నూకరాజు, అప్పలరాజు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి వీల్‌చైర్ వితరణ



దివ్యాంగురాలికి వీల్ చైర్ అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: నిరుపేదలను ఆదుకోవడమే లక్ష్యంగా రోటరీ క్లబ్ అనకాపల్లి శాఖ నిరంతరం పని చేస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. గురువారం మండలంలోని గవరపేట గౌరీ కమ్యూనిటీ హాల్లో జరిగిన కార్యక్రమంలో చిక్కాల యశోద అనే దివ్యాంగురాలికి వీల్‌చైర్ అందించారు. మరో నిరుపేద విద్యార్థిని అరుణకు రూ.3 వేలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఆళ్ల ఓం రాము, ఎన్ఏబీ వర్మ, దాడి శివరాము, పిళ్లా నిర్మల, వై.కేశవరావు, జీఎస్‌ఆర్ శేషగిరిరావు, దాట్ల రాఘవరావు, వానపల్లి ఈశ్వర్రావు, కేఎస్ఎన్ మూర్తి, పిల్లా గోపాలరావు, సానా త్రినాథరావు, రాపేటి నారాయణరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై విద్యార్థులకు కౌన్సెలింగ్

అనకాపల్లిటౌన్: మండలంలో రేబాక బస్టాప్ వద్ద గురువారం సాయంత్రం గ్రామీణ ఎస్‌ఐ నరసింగరావు ర్యాగింగ్‌పై విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే ఎదుర్కొనే పరిణామాలపై వివరించారు. విద్యార్థులు స్నేహభావంతో మెలగాలని సూచించారు. ర్యాగింగ్‌పై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కలాం అడుగుజాడల్లో నడుద్దాం



కలాం విగ్రహం ముందు విల్లూరి పైడారావు, సంస్థ సభ్యులు

అనకాపల్లిటౌన్: అబ్దుల్ కలాం అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని అబ్దుల్ కలాం సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఆళ్ల ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఎదుటనున్న కలాం విగ్రహం వద్ద గురువారం కలాం 8వ వర్ధంతిని నిర్వహించారు. అంతకుముందు మాజీ మున్సిపల్ చైర్మన్ విల్లూరి పైడారావు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, సంస్థ సభ్యులు ఎస్.చిరంజీవి, కొణతాల రాజు, మళ్ల భోగలింగం, ఉప్పల సాయి, మళ్ల పద్మ, మాజీ కౌన్సిలర్ పెతకంశెట్టి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడిక తొలగింపు

సబ్బవరం: మండల కేంద్రంలో పలు ప్రాంతాలు నీటి ముంపునకు గురికావడంతో పంచాయతీ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పోలీస్ స్టేషన్, సబ్బవరం శివాలయం ప్రాంతాలు నీట మునిగాయి. దీంతో వీటిని ఆనుకుని ఉన్న జాతీయ రహదారి కూడా ముంపునకు గురికావడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయి నగర్ కాలనీ నుంచి వరద నీరు ప్రధాన రహదారిపై ప్రవహిస్తూ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను ముంచెత్తింది. దీంతో సబ్బవరం పంచాయతీ అధికారులు ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను గురువారం జేసీబీ సాయంతో చేపట్టారు. కాలువల్లో చెత్తాచెదారం వేయొద్దని స్థానికులను కోరారు. పంచాయతీ కార్యదర్శి మూర్తి బాబు, నాయకులు కొల్లి కృష్ణ, కొల్లి గంగునాయుడు పూడిక తొలగింపు పనుల్ని పర్యవేక్షించారు.